ప్రజాశక్తి

ఆదివారం 20 ఆగస్టు 2023

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## యాజమాన్య హక్కుల కల్పనకు ప్రణాళికలు

### 21లోపు ఓటర్ల సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పనకు ప్రణాళికలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నాడు జిల్లాలోని వివిధ మండలాల అధికారులతో డిఆర్ఒ కొండయ్యతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో రెవెన్యూ అంశాలైన రీ సర్వే, అసైన్డ్ భూములు, వ్యవసాయ శాఖ, జగనన్న పాల వెల్లువ, పశు సంవర్ధక శాఖ, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కింద ప్రాధాన్యతా భవనాల పురోగతి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, ఇంటింటి ఓటర్లసర్వే తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేరెండవ విడతలో భూముల రీ సర్వే పూర్తి అయిన వాటిలో రాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. సంబంధిత తహశీల్దార్లు, సర్వే సిబ్బంది ఈ పనుల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. భూమిలేని దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలను గుర్తించి వారికి అసైన్డ్ భూమి యాప్ నందు నమోదు ప్రక్రియ పూర్తిచేసి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆమోదంతో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పన కార్యక్రమానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమంను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరినీ జాబితా నుంచి తొలగించరాదన్నారు. ఇంటింటికి ఓటర్ల సర్వే ఈనెల 21వ తేదీ నాటికి వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రాప్ నమోదును పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఎస్‌సిపిఆర్ గోపాల్ రెడ్డి, డీఎంహెచ్వో ఎస్‌వి.కృష్ణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్సీ రషీద్ ఖాన్, సిపిఒ విజయ్ కుమార్ తెలిపారు.

# పోటాపోటీ..!

**◆ పంచాయతీ ఉప ఎన్నికల్లో అధికార వైసిపికి టిడిపి గట్టి పోటీ ◆ సర్పంచి స్థానాల్లో ఒకటి వైసిపి, ఒకటి టిడిపి గెలుపు**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

గ్రామం పంచాయతీల్లో జరిగిన ఉపఎన్నికల్లో అధికార వైసిపికి ప్రతిపక్ష టిడిపి గట్టిపోటీనే ఇచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు సర్పంచి స్థానాలకు, 24 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఇందులో సర్పంచి స్థానాల్లో ఒకటి అధికార వైసిపి మద్దతుదారులు విజయం సాధించగా, మరొకటి టిడిపి మద్దతుదారులు విజయం సాధించారు. వార్డుల్లో 13 వార్డుల్లో వైసిపి మద్దతుదారులు గెలుపొందారు. 11 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. రెండు జిల్లాల్లోనూ పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా సాగాయి.

**సర్పంచులు చెరొకటి**

సత్యసాయి జిల్లాలోని హిందూపురం మండలంలోని చలివెందుల గ్రామ పంచాయతీ సర్పంచి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికను అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండూ ప్రతిష్టాత్మకంగానే తీసుకుని ప్రచారం చేశాయి. ఇక్కడ వైసిపి మద్దతుదారుడు ఉపేంద్రకుమార్‌రెడ్డి 337 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకు మునుపు గ్రామ సర్పంచిగా ఉపేంద్ర తల్లి ఉండేది. ఆమె మరణంతో ఖాళీపడిన ఈస్థానానికి ఇప్పుడు జరిగిన ఈ ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. ఇక అనంతపురం జిల్లాలో యల్లనూరు మండలంలో జగ్గంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు కుళ్లాయప్ప విజయం సాధించారు.

**టిడిపిలో జోష్**

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైసిపితో పోటీపడి మెరుగైన స్థానాల్లో విజయం సాధించడంతో టిడిపి శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఇది ఒక శ్యాంపుల్ సర్వేలా ఉందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో టిడిపికి అంత సానుకూలత లేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నెలకొంది. ఇప్పుడు గ్రామ పంచాయతీకి జరిగిన వార్డుల్లోనూ, సర్పంచి స్థానాల్లోనూ మెరుగైన ఓట్లు రావడం చూసి ఆనందపడిపోతున్నారు, అధికార వైసిపి తమ అధికార బలాన్ని ప్రయోగించినా తమ మద్దతుదారులకు గట్టిపోటినిచ్చారని చెబుతున్నారు. అధికార వైసిపి మాత్రం ఈ ఎన్నికలను తాము అంత సీరియస్‌గా తీసుకోలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఉప ఎన్నికల పోరు రసవత్తరంగానే సాగింది. ఈ ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు సైతం నిశితంగానే పరిశీలిస్తున్నారు. రాబోయే సాధారణ ఎన్నికలకు ఇవి శ్యాంపుల్ సర్వేలనే భావించాల్సి ఉంటుందంటున్నారు.

**ప్రశాంతంగా సాగిన ఎన్నికలు**

ఉప ఎన్నికలు రెండు జిల్లాల్లోనూ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకు అన్ని చోట్ల పోలింగ్ మొదలైంది. సాయంత్రం ఓట్ల లెక్కింపు కూడా పూర్తయి ఫలితాలను వెల్లడించారు. ఎక్కడా చిన్నపాటి ఘర్షణ, వివాదం లేకుండా సాఫీగా సాగాయి.

యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

### శ్రీ సత్యసాయి జిల్లా

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 వార్డులు, ఒక సర్పంచి స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఒకే నామినేసన్ దాఖలు కావడంతో 15 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన హిందూపురం మండలం చలివెందుల సర్పంచి స్థానానికి, 13 పంచాయతీల్లో 13 వార్డులకు శనివారం నాడు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిధిలో 13 వార్డులకు ఉపఎన్నిక జరగ్గా ఇందులో 7 టిడిపి మద్దతుదారులు, 6 వైసిపి మద్దతుదారులు గెలుపొందారు. ఇక హిందూపురం మండలం చలివెందుల సర్పంచి స్థానానికి జరిగిన ఎన్నికలో వైసిపి మద్దతుదారుడు విజయం సాధించారు.

### అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 33 వార్డులు, రెండు సర్పంచి స్థానాలకు ఎన్నికల నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 22 వార్డులతో పాటు పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడు సర్పంచి స్థానంకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇక మిగిలిన 11 వార్డులతో పాటు యల్లనూరు మండలం జంగంపల్లి సర్పంచి స్థానానికి శనివారం నాడు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిధిలో 11 వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతుదారులు 5, వైసిపి మద్దతుదారులు 6 స్థానాల్లో గెలుపొందారు. ఇక యల్లనూరు మండలం జంగంపల్లి పంచాయతీ సర్పంచి ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు విజయం సాధించారు.

**శ్రీ సత్యసాయి వార్డు ఉప ఎన్నికల ఫలితాలు**

| మండలం | పంచాయతీ | వార్డు స్థానం | గెలిచిన అభ్యర్థి | పార్టీ |
|---|---|---|---|---|
| అగళి | అగళి | 2 | లక్ష్మీనరసింహ్మమూర్తి | టిడిపి |
| అమడగూరు | చిన్నగానపల్లి | 3 | దేవరాజు | టిడిపి |
| అమడగూరు | అమడగూరు | 11 | నారాయణస్వామి | వైసిపి |
| అమరాపురం | నిద్రగట్ట | 4 | కెంచమ్మ | టిడిపి |
| బత్తలపల్లి | తంబాపురం | 3 | లక్ష్మీనారాయణమ్మ | వైసిపి |
| బుక్కపట్నం | క్రిష్ణాపురం | 7 | మంజుల | వైసిపి |
| గాండ్లపెంట | మల్లమీదపల్లి | 9 | విజయ | వైసిపి |
| గోరంట్ల | గోరంట్ల | 18 | నరసింహ్మప్ప | వైసిపి |
| గుడిబండ | గనేమోరుబాగల్ | 10 | నరసింహ్మప్ప | టిడిపి |
| లేపాక్షి | పులమతి | 10 | నవీన్ | టిడిపి |
| రొద్దం | రొద్దం | 3 | ఈశ్వరప్ప | టిడిపి |
| సోమందేపలి | బ్రహ్మసముద్రం | 2 | కంబాలప్ప | వైసిపి |
| తలుపుల | ఉడుములకుర్తి | 4 | రమేష్‌నాయుడు | టిడిపి |

**సర్పంచి స్థానం**

| మండలం | పంచాయతీ | గెలిచిన అభ్యర్థి | పార్టీ | మెజార్టీ |
|---|---|---|---|---|
| హిందూపురం | చలివెందులు | ఉపేంద్రకుమార్‌రెడ్డి | వైసిపి | 337 |

**అనంతపురం వార్డు ఉప ఎన్నికల ఫలితాలు**

| మండలం | పంచాయతీ | వార్డు స్థానం | గెలిచిన అభ్యర్థి | పార్టీ |
|---|---|---|---|---|
| యల్లనూరు | బొప్పేపల్లి | 3 | మంజుల లీలావతి | వైసిపి |
| పుట్లూరు | చెర్లోపల్లి | 1 | నాగలక్ష్మి | టిడిపి |
| నార్పల | నార్పల | 8 | నాగభూషణం | టిడిపి |
| గార్లదిన్నె | బూదేడు | 9 | సుంకమ్మ | వైసిపి |
| కూడేరు | కలగళ్ల | 9 | మల్లేశ్వరి | టిడిపి |
| గుత్తి | లచ్చానుపల్లి | 7 | సుగణమ్మ | వైసిపి |
| గుత్తి | చెర్లోపల్లి | 4 | పుల్లన్న | వైసిపి |
| గుత్తి | ధర్మాపురం | 4 | ఆంజనేయ | టిడిపి |
| యాడికి | రాయలచెరువు | 12 | లక్ష్మీదేవి | టిడిపి |
| యాడికి | యాడికి | 19 | శ్రీరాములు | వైసిపి |
| పెద్దవడుగూరు | జి.వెంకటాంపల్లి | 4 | లక్ష్మీదేవి | వైసిపి |

**సర్పంచి స్థానం**

| మండలం | పంచాయతీ | గెలిచిన అభ్యర్థి | పార్టీ |
|---|---|---|---|
| యల్లనూరు | జంగంపల్లి | కుళ్లాయప్ప నాయుడు | టిడిపి |

## హిందూపురం సబ్‌జైలు తనిఖీ

**ప్రజాశక్తి-హిందూపురం**

సబ్ జైలును శనివారం సాయంత్రం జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిందితులతో ఏఏ కేసుల్లో నేరాలు చేసి జైలుకు వచ్చారు, ఎంత కాలం నుంచి జైలులో ఉంటున్నారు తదితర విషయాలను ఖైదీలతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు గదులను పరిశీలించి అక్కడ సమకూర్చుతున్న సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పులు చేసిన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకుని మెలగాలన్నారు. జైలుకు రావడం వల్ల మీ కుటుంబాలకు కూడా అగౌరవం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుధాకర్, రమేష్, రకీబ్, సందీప్, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

## భూ బాధితులకు ఇంటి పట్టాలు పంపిణీ

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో, తహశీల్దార్

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పేదలకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గతంలో రెవెన్యూ అధికారులు భూసేకరణ చేపట్టగా పోతులనాగేపల్లికి చెందిన 37 మంది రైతులు తమ పొలాలను పేదకు ఇంటి స్థలాల కోసం ఇచ్చారు. దీంతో అప్పట్లో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రైతుకు ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున పురిహారం అందజేశారు. అయితే రైతుల కోరిక మేరకు 37 మంది రైతులకు సర్వే నెంబర్-36లో ఒక్కొక్కరికి 3 ప్లాట్లు చొప్పున 111 ప్లాట్లను శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ తిప్పేనాయక్ సమక్షంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. భూ సేకరణలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఇళ్ల పట్టాలను ఇచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో తిప్పేనాయక్, తహశీల్దార్ యోగేశ్వరీదేవి, వైసిపి రాష్ట్ర ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వీఆర్వో భాస్కర్, 37 మంది రైతు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించాలని వినతి

**ప్రజాశక్తి-లేపాక్షి**

ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని కోరుతూ శనివారం సిపిఎం కార్మిక, కర్షక నాయకుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు పది వారాల నుంచి బిల్లులు అందక కుటుంబ పోషణ భారమైందని, కావున వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, గంగప్ప, కూలీలు పాల్గొన్నారు.

## వాల్మీకులకు ఎస్టీ హోదా వైఎస్.జగన్‌తోనే సాధ్యం

### రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర

**ప్రజాశక్తి-హిందూపురం**

రాష్ట్రంలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర పేర్కొన్నారు. శనివారం సాయంత్రం హిందూపురం పట్టణం గుడ్డం ప్రాంతంలో పొగాకు రామచంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వాల్మీకి సంఘం నేతలు పొగాకు రామచంద్రను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పొగాకు రామచంద్ర మాట్లాడుతూ వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. వాల్మీకి, బోయల సమస్యల పరిష్కారం కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మరోమారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి వాల్మీకి కుటుంబ సభ్యులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేతలు గాంధీ, డిఆర్‌జి శ్రీనివాసులు, వెంకటేశులు, రమేష్, చిరు, అనిల్, లక్ష్మీనారాయణ, పాదయాత్ర నటేష్ పాల్గొన్నారు.

## అందరి ఆదరాభిమానాలు పొందాలి

### ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో వక్తల పిలుపు

**మడకశిర-ప్రజాశక్తి రూరల్**

దైనందిన జీవనంలో వృత్తి ఏదైనప్పటికీ అంకిత భావంతో నిర్వర్తిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందాలని వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహం ఆవరణలో శనివారం ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయవాది లోకేష్, ఎఎస్ఐ బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమ సమాజంలో అన్ని రంగాల్లో పోటీతత్వం నెలకొందని, వాటిని అధిగమించడానికి వృత్తి నైపుణ్యంతో పాటు కాలానుగుణంగా వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం సంఘం అధ్యక్షుడు జగదీష్, న్యాయవాది లోకేష్‌ను సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ప్రసాద్‌బాబు, సంఘం అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ట్రెజరర్ రొళ్ల దాసప్ప, సెక్రటరీ గురు, జాయింట్ సెక్రటరీ కాణిమప్ప, ఈసీ మెంబర్లు, యూనియన్ సభ్యులు, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

మంటల్లో దగ్ధమైన కారు

## డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

**ప్రజాశక్తి-కనగానపల్లి**

కనగానపల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఓ కారు అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్‌ను ఢీకొట్టిన వెంటనే కారులో మంటలు చెలరేగి అక్కడికక్కడే కారు దగ్ధమైంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... బెంగళూరుకు చెందిన నారాయణస్వామి తాడిపత్రిలో జరుగుతున్న ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు తన సొంత కారులో బయల్దేరాడు. మామిళ్లపల్లి జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. వెంటనే మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ సమయంలో అప్రమత్తమైన నారాయణస్వామి వెంటనే కారు నుంచి కిందకు దూకేశాడు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మంటలు వ్యాపించి కారు నిమిషాల్లో కాలి బూడిద అయ్యింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## గంజాయి స్వాధీనం

గంజాయి స్వాధీనం చేసుకున్న వివరాలను వెల్లడిస్తున్న సిఐ

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

గంజాయిని అక్రమంగా అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతనివద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని తిక్కస్వామినగర్లో గంజాయి ఆకులు ఆమ్ముతున్న సమాచారం రావడంతో డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు దాడులు చేశారు. గంజాయి ఆకులు అమ్ముతున్న సాకేశంకర, ఆర్వేటి సాయిలును అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15వేలు విలువ చేసే గంజాయిను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు.

## పోలింగ్ కేంద్రం వద్దే ఓటుకు నోట్లు పంపిణీ

**◆ ప్రతిఘటించిన టిడిపి ◆ చోద్యం చూసిన పోలీసులు**

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం రూరల్ మండలం చలివెందుల పంచాయితీ ఎన్నికలు ప్రశంతంగా ముగిసాయి. అధికార పార్టీకి చెందిన మండల వైస్ ఎంపిపి రఘునాథ్ రెడ్డి పోలింగ్ కేంద్రం వద్దే ఓటర్లకు ఓటుకు నోటు ఇచ్చి ప్రచారం చేస్తున్న విషయాన్ని ప్రతిపక్ష టిడిపి నాయకులు అడ్డుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు చోద్యం చూశారే తప్ప వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనిని చూసిన టిడిపి నాయకులు ప్రతిఘటించి డబ్బులు పంపిణీపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వైసిపి బలపరిచిన సర్పంచి అభ్యర్థి ఉపేంద్ర రెడ్డిని ఎలాగైనా గెలిపించుకోవాలనే ఉద్దేశంతో పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి స్థానిక నాయకులతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజా ప్రతినధులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తు ఓటు వేసి రాగానే మహిళలకు, వద్దులకు పోలింగ్ కేంద్రం వద్ద రూ.1000 చొప్పున నగదును పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న రాచపల్లిలో వాలంటీర్లు ఓటు అడుగుతున్నారని ఆగ్రహించిన రాచపల్లి ఎస్సీ కాలనీవాసులు వాలంటీర్లకు స్థానికుల మధ్య తోపులాట జరిగింది. వైసిపి బలపరిచిన అభ్యర్థి తరపున గ్రామ వాలంటరీ ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తుండడంతో గ్రామస్తులు తిరగబడ్డారు. వైసిపి నాయకులు, వాలంటర్లు తమ కాలనీకి రావద్దు అంటూ స్థానికులు అడ్డుపడి ఘర్షణకు దిగారు. వైసిపి సర్పంచి అభ్యర్థికి ఓటు వేయకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రావని ఓటర్లను వాలంటీర్లు భయపెట్టడానికి ప్రయత్నం చేశారు. దీంతో ఆ కాలనీవాసులు తమకు నచ్చిన వారికి ఓటు వేస్తామని, ఓటర్లను వాలంటర్లు ప్రభావితం చేస్తే గ్రామంలో వాలంటీర్లను తిరగనివ్వమని వాగ్వాదం చేసుకున్నారు. వెంటనే ఘర్షణ స్థలానికి పోలీసులు చేరుకుని ఇరు వర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. ప్రజాప్రతినిధులు అందరూ పోలింగ్ కేంద్రం వద్దే ఉన్నప్పటికీ పోలీసులు వారిపై ఏలాంటి చర్యలూ తీసుకోక పోవడంపై తీవ్ర విమర్శలు వినపిస్తున్నాయి.

పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు డబ్బులను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపిపి

## గ్రూప్-1 ర్యాంకర్‌కు అభినందనలు

స్వాతి

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని స్వాతి ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 8వ ర్యాంక్ సాధించి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి, అధ్యాపక బందం శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ 2010-13 మధ్య మహిళా డిగ్రీ కళాశాలలో బిజడ్‌సి గ్రూపుతో బీఎస్సీ పూర్తిచేసిన స్వాతి చదువుకునే రోజుల్లో చదువులోనే కాక, ఎన్‌సిసి, గేమ్స్‌తో పాటు ఇతర అనేక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేదన్నారు. చదువు పూర్తయిన తర్వాత 2018లో పోలీసు శాఖలో సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టుకు ఎంపికై, ఎస్ఐగా పనిచేస్తూనే మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని సంకల్పించి, వివాహమనంతరం గ్రూప్-1 పరీక్షలు రాయడానికి సిద్ధమయిందన్నారు. గ్రూప్-1 పరీక్షలు రాసి ఎనిమిదో ర్యాంకు పొందడం, డిప్యూటీ కలెక్టర్ కావడం కళాశాలకు గర్వకారణమని వారు ఆనందం వ్యక్తం చేశారు. అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ఖాదర్ కూడా స్వాతికి అభినందనలు తెలిపారు.

## కేసుల సత్వర పరిష్కారానికి సహకరించండి

### అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

**ప్రజాశక్తి-హిందూపురం**

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్‌లతో కలిసి న్యాయవాదులు, పోలీసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న అన్ని కేసులనూ పరిష్కరించేందుకు అటు పోలీసులు, ఇటు న్యాయవాదులు కషి చేయాలన్నారు. కక్షిదారులు కూడా కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురి కాకుండా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులను కూడా గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం జరిగిన లోక్‌అదాలతో పలు కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, ఏపీపీ నగేష్, న్యాయవాదులు సుదర్శన్, సిద్దు, కళావతి, నవేరా, నారాయణ గౌడ్, రాఖీబ్, వన్నూరప్ప, లోక్ అదాలత్ శారద, హేమావతి పాల్గొన్నారు.

న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

# పంచాయతీ ఉపపోరు ప్రశాంతం


బికె పార్థసారథిని కలిసిన రొద్దం 3వ వార్డు మెంబర్ ఈశ్వరప్ప

**ప్రజాశక్తి-మడకశిర**

నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం జరిగిన పంచాయతీ ఉపఎన్నికల్లో మూడు చోట్ల టిడిపి మద్దతుదారులు గెలుపొందారు. వారిలో అగళి పంచాయతీ 2వ వార్డులో నరసింహమూర్తి 41 ఓట్లు, గుడిబండ మండలంలోని ఆచార్యపాలెం పంచాయతీలో నరసింహప్ప 30 ఓట్లు, అమరాపురం మండలం నిడగల్లు పంచాయతీలో కెంచప్ప 22 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి నాయకత్వంలో మూడు చోట్ల టిడిపి మద్దతు దారులు విజయం సాధించడంతో టిడిపి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

**రొద్దం :** రొద్దం పంచాయతీలోని 3వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు ఈశ్వరప్ప 61 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 416 ఓట్లు పోలవ్వగా వైసిపి మద్దతుదారుడికి 172, టిడిపి మద్దతుదారుడికి 233 ఓట్లు దక్కాయి. విజయం అనంతరం టిడిపి శ్రేణులు పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆర్.మరవపల్లిలో వెళ్లి పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథిని కలిశారు. ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు మొదలైందని, అందుకు ఈ ఉపఎన్నికలే నిదర్శనమన్నారు. వైసిపి అరాచక పాలన పట్ల విసుగు చెందిన ప్రజలు మార్పునకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిడిపి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, అశ్వర్థ నారాయణ, చిన్నపరెడ్డి, నాగరాజు, హరీష్, మురళి, ఇమామ్ పాల్గొన్నారు.

**లేపాక్షి :** మండల పరిధిలోని పులమతి పంచాయతీ 10వ వార్డుకు శనివారం జరిగిన ఉపఎన్నికల్లో టిడిపి బలపరిచిన నవీన్ 16 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 206 ఓట్లు పోలవగా వైసిపి బలపరిచిన అభ్యర్థి ఆదిలక్ష్మికి 91, టిడిపి మద్దతుదారుడు నవీన్‌కు 107 ఓట్లు రాగా 8 ఓట్లను ఇన్‌వాలిడ్‌గా గుర్తించి తొలగించారు. ఎన్నికల అధికారి శివన్న తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మునీర్ అహ్మద్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**అగళి :** అగళి పంచాయతీలోని 2వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుతో లక్ష్మీనరసింహమూర్తి, టిడిపి తరఫున నరసింహమూర్తి, స్వతంత్ర అభ్యర్థిగా నందకుమార్ ముగ్గురు పోటీ చేశారు. శనివారం పోలింగ్ నిర్వహించగా మొత్తం 252కిగానూ 223 ఓట్లు పోలయ్యాయి అందులో టిడిపి మద్దతుదారు నరసింహమూర్తికి 131, వైసిపి మద్దతుదారు లక్ష్మీనరసింహమూర్తికి 92, స్వతంత్ర అభ్యర్థికి 2 ఓట్లు లభించగా, ఒక ఓటు నోటాకు పడ్డాయి. దీంతో టిడిపి మద్దతుదారు 36 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి పద్మావతి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ లావణ్య ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు.

**గుడిబండ :** మండల పరిధిలోని గునేమోరుబాగల్ 4వ వార్డుకు జరిగిన ఉపఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి నరసింహప్ప, వైసిపి మద్దతుదారు నాగరాజుపై 30 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ మునిప్రతాప్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

**గోరంట్ల :** గోరంట్ల మేజర్ గ్రామపంచాయతీలోని 18వ వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు నరసింహప్ప గెలుపొందారు. ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు జరిగింది. అనంతరం నరసింహప్ప 161 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ తెలిపారు. అనంతరం నర్సింహప్పకు డిక్లరేషన్ ఫారం అందజేశారు. మొత్తం 996 ఓట్లు ఉండగా వైసిపి మద్దతుదారు నర్సింహప్పకు 381, జనసేన పార్టీ బలపరచిన అభ్యర్థి గోవిందమ్మకు 27, టిడిపి మద్దతుదారు నరసింహప్పకు 221, టిడిపి మరో అభ్యర్థి శ్రీకాంత్‌కు 110 ఓట్లు లభించాయి. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా తహశీల్దార్ రంగనాయకులు వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, స్టేజ్ టు ఆఫీసర్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** మండల పరిధిలోని మల్లమీద పల్లి పంచాయతీ 9వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైసిపి మద్దతుదారు డి.విజయ టిడిపి మద్దతుదారు ఎం.లక్ష్మీదేవి పై 27 ఓట్ల మెజార్టీ సాధించారు. దీంతో విజయకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీత డిక్లరేషన్ అందజేశారు. మొత్తం 242 ఓట్లు ఉండగా 165 పోలవగా వైసిపికి 94, టిడిపికి 67 ఓట్లు దక్కాయి. చెల్లని ఓట్లు 4 గుర్తించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తనకల్లు ఎస్ఐ రాంభూపాల్ బందోబస్తు నిర్వహించారు.

**బత్తలపల్లి :** మండల పరిధిలోని తంబాపురం గ్రామ పంచాయతీ 3వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైసిపి మద్దతుదారు బి.లక్ష్మీనారాయణమ్మ టిడిపి బలపరిచిన గిరక నారాయణమ్మపై 72 ఓట్ల తేడాతో విజయం సాధించింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియలో మొత్తం 128 ఓట్లకు గాను 114 ఓట్లు పోలయ్యాయి. బి.లక్ష్మీనారాయణమ్మకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ అందజేశారు. దీంతో వైసిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు బైక్ ర్యాలీగా బత్తలపల్లి కూడలికి చేరుకుని బాణసంచా పేల్చారు. దీంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు చేరుకుని వాహనాలను పంపించారు. ధర్మవరం రూరల్, టౌన్ సిఐలు ఆరోహణరావు, సుబ్రహ్మణ్యం, పోతుకుంట, తాడిమర్రి, కనగానపల్లి, ఇంటెలిజెన్స్ ఎస్ఎస్‌బి ప్రదీప్‌కుమార్, లక్ష్మీనారాయణ, హనుమంతరెడ్డి, శ్రీరాములుతో పాటు 30 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న తంబాపురం 3వ వార్డు మెంబర్ బి.లక్ష్మీనారాయణమ్మ

**బుక్కపట్నం :** మండల పరిధిలోని కృష్ణాపురం పంచాయతీ 7వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతుదారు వరలక్ష్మిపై వైసిపి మద్దతుదారు మంజుల 3 ఓట్ల తేడాతో గెలుపొందారు. హోరాహోరీగా జరిగిన ఉప ఎన్నికల్లో 158 మంది ఓటు హక్కు వినియోగించు కోగా మంజులకు 78, వరలక్ష్మికి 75 ఓట్లు, 2 చెల్లని ఓట్లు గా నమోదైనట్లు ఎన్నికల అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు.

**సోమందేపల్లి :** మండల పరిధిలోని బ్రహ్మసముద్రం పంచాయతీ 2వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైసిపి బలపరిచిన కంబాలప్ప టిడిపి మద్దతుదారుడు హనుమంతుపై 21 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో వైసిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న పులమతి 10వ వార్డు మెంబర్ నవీన్

## చలివెందుల ఉపఎన్నికల్లో వైసిపి మద్దతుదారుడు గెలుపు

ఉపేంద్ర కుమార్ రెడ్డి

**హిందూపురం :** హిందూపురం మండలం చలివెందుల గ్రామ పంచాయతీకి శనివారం జరిగిన సర్పంచి ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారుడు ఉపేంద్ర కుమార్ రెడ్డి విజయం సాధించారు. టిడిపి మద్దతు దారుడు రవీంద్ర రెడ్డిపై 337 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. గత సర్పంచు ఎన్నికల్లో ఉపేంద్ర కుమార్ రెడ్డి తల్లి సౌభాగ్యమ్మ 711 ఓట్ల అధిక్యంతో గెలుపొందగా ప్రస్తుత ఎన్నికల్లో 337 ఓట్లతో మాత్రమే ఆమె తనయుడు ఉపేంద్ర కుమార్ రెడ్డి విజయం సాధించారు. మెజార్టీ భారీగా తగ్గడంపై అధికార పార్టీ నాయకులను విస్మయానికి గురి చేస్తోంది. అధికార పార్టీకి గట్టిపోటీనే ఇచ్చామని టిడిపి నాయకులు చెబుతున్నారు. చలివెందుల పంచాయతీలో మొత్తం 2514 ఓట్లు ఉండగా 2077 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి నరేంద్ర కుమార్ వైసిపి మద్దతుదారుడు ఉపేంద్ర కుమార్ రెడ్డి 337 ఓట్ల అధిక్యంతో విజయం సాధించినట్లు ప్రకటించి, డిక్లరేషన్ పత్రాన్ని అందించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో ఎక్కడా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆసుపత్రులు సీజ్ చేస్తామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా లెవెల్ మల్టీ మెంబర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాలపై నిఘా, కొత్త వాటికి దరఖాస్తుల పరిశీలన, రెన్యువల్ చేసుకున్న వాటిపై అధికారులు చర్చించారు. అనుమతుల మంజూరు విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. పోలీసులు, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసి డేకామ్ ఆపరేషన్లు జరపాలని సూచించారు. స్కానింగ్ సెంటర్లపై ప్రతి నెలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమావేశం నిర్వహించాలన్నారు. ముఖ్యంగా కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి, దిశా డిఎస్పి వరప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ తిపేంద్ర నాయక్, డిఐఒ కృష్ణయ్య, లీగల్ అడ్వైజర్ పాల్గొన్నారు.

## రెండేళ్ల బాలుడిపై వీధికుక్కల దాడి

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కదిరి పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకీ తీవ్రమవుతోంది. రెండు నెలల్లోనే నాలుగైదు ప్రాంతాల్లో వీధి కుక్కలు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతలోనే శనివారం పట్టణంలోని నల్లగుట్ట వీధికి చెందిన ప్రభుత్వాసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న మంజుల రెండేళ్ల కుమారుడు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేసి గాయపరిచాయి. రెండు నెలల క్రితం అడపాల వీధి ప్రాంతానికి చెందిన ఓ బాలుడిని, నిజాంవలి కాలనీకి చెందిన ఓ బాలికపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీధుల్లో కుక్కల సంచారం పెరిగిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను నియంత్రిం చాలని మున్సిపల్ అధికారులు, పాలకులకు తెలిపిన ఫలితం లేదని పట్టణవాసులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## వైసిపికి మరొక అవకాశమివ్వండి

**ప్రజాశక్తి-మడకశిర**

రాష్ట్ర ప్రజలు మరొకసారి వైసిపిని ఆదరించాలని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు కోరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షే మ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ముందుగా చౌటుపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎపిలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. 14 ఏళ్లు సిఎంగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవని పవన్ కళ్యాణ్ కేవలం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరంగా రెడ్డి, శివన్న, తిప్పన్న, తిమ్మప్ప, బేకరీ నాగరాజు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు

## రాచువారిపల్లి 8వ వార్డు ఏకగ్రీవం

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

మండల పరిధిలోని రాచువారిపల్లి గ్రామపంచాయతీ 8వ వార్డు మెంబర్ ఎంపిక ఏకగ్రీవమైంది. ఈ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించగా టిడిపి మద్దతుదారుడైన సూర్యనారాయణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన ఎంపికను ఏకగ్రీవం చేస్తూ ఆయనకు డిక్లరేషన్ ఫారం అందజేశారు. ఈయన ఎంపిక పట్ల టిడిపి మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రూప్-1 ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందనలు

**కదిరి టౌన్ :** నంబులపూలకుంట మండల పరిధిలోని మర్రికొమ్మదిన్నె గ్రామానికి చెందిన మాజీ విఆర్ఒ పెద్దిరెడ్డి కుమారుడు జ్ఞానానందరెడ్డి గ్రూప్-1లో ఉత్తమ ర్యాంకు సాధించినందుకు ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో అభినందించారు. ఉద్యోగరీత్యా ఎటువంటి ఒడిదుడుకులకు లోను కాకుండా ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ వీలైనంత ఎక్కువ మందికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

## నీట్ ర్యాంకర్‌కు ఆర్థిక సాయం

**నల్లచెరువు :** మండల పరిధిలోని దామవాండ్లపల్లికి చెందిన నిరుపేద విద్యార్థి జశ్వంత్‌రాజ్ నీట్‌లో ఉత్తీర్ణత సాధించి ఎంబిబిఎస్ సీటు సాధించాడు. అయితే వైద్య విద్య చదవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి పాలెం సుధాకర్ శనివారం రూ. 20వేలు అందజేశారు.

## క్రాప్ బుకింగ్ చేసుకోండి

**ప్రజాశక్తి-నల్లచెరువు**

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంట వేసిన ప్రతి రైతూ తాము వేసిన పంటను క్రాప్ బుకింగ్ చేయించుకోవాల ని ఎఒ భారతి తెలిపారు. ఎఒ శనివారం ఓరువాయి, కె.పూలకుంట గ్రామాల్లో పంటలను పరిశీలించి పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట వేసిన ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్కులతో ఆర్‌బికెలలో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

**మడకశిర :** ఐకెపి సిబ్బందికి పిఆర్‌సి అమలు చేయడం పట్ల శనివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో ఐకెపి సిబ్బంది సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని ఇందిరా క్రాంతి పథకం సమావేశ భవనంలో నిర్వహించిన సమా వేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐకెపి సిబ్బందికి ఇబ్బందులను గుర్తించిన సిఎం జగన్ 23 శాతం పిఆర్‌సి ప్రకటించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల ఐకెపి ఎపిఎం, సిబ్బంది హాజరయ్యారు.

## దోమ పుట్టరాదు.. కుట్టరాదు..!

**ముదిగుబ్బ :** పిహెచ్‌సి మండల వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర ఆదేశాల మేరకు శనివారం దొరిగిల్లు వైఎస్ఆర్ క్లినిక్, దొరిగిల్లు క్వాటర్స్‌లో ఇంటింటికీ తిరిగి లార్వా సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి దోమలు ఉన్న స్థలాలను గుర్తించి అబేట్ ద్రావణము, నిల్వ ఉన్న నీటిలో వేస్ట్ ఆయిల్ చల్లారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి నీటిలో పెరిగే దోమ కుట్టడం వల్ల డెంగీ జ్వరం వస్తుందని, కావున ఇంటి చుట్టుపక్కల పాత టైర్లు, పనికిరాని కుండలు, టెంకాయ చిప్పలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దొరిగిల్లు ఎంపిహెచ్ ఎం.నాగరాజు, దొరిగిల్లు సచివాలయం హెల్త్ సెక్రటరీ చక్రి, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, ఉమాదేవి, మీనా, సరస్వతి, అంగన్వాడీ టీచర్ బిబి పాల్గొన్నారు

## మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

**పుట్టపర్తి అర్బన్ :** మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాపనపల్లి శివప్ప పేర్కొన్నారు. పుట్టపర్తిలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా మానవ హక్కులకు భంగం కలిగితే అక్కడికి వెళ్లి పరిశీలించి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సంస్థ సిఇఒ తూము రామచంద్రనాయుడు జన్మదినం పురస్కరించుకొని స్థానిక సాయి గురుపాద ప్రాథమిక పాఠశాలలో 1-5 తరగతి విద్యార్థులకు 220 వాటర్ బాటిల్స్, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. త్వరలో సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కులు, వాటిని వినియోగించుకునే పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రమణ, శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ ప్రసాద్

పుట్టపర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను శనివారం ఎంఇఒ ప్రసాద్ తనిఖీ నిర్వహించారు. ఎంఇఒ ఉదయం టిఫిన్ సమయంలో హాస్టల్‌లోకి ప్రవేశించి రికార్డులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు వడ్డిస్తున్న టిఫిన్‌ను పరిశీలించి మెనూ ప్రకారం అందజేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్ పరిసర ప్రాంతాలు, రెస్ట్ రూములు, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకోసం సాయంకాలం ట్యూటర్లు, స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్న సందర్భంగా వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకులతో తాగునీటి సరఫరా

**తనకల్లు :** మండల పరిధిలోని గుంజువారిపల్లి, గుంజువారిపల్లి హరిజనవాడ, రెడ్డివారిపల్లి గ్రామాలకు చెందిన తాగునీటి బోరు మరమ్మతులకు గురవడంతో నాలుగు రోజులుగా గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రెడ్డివారిపల్లికి చెందిన టిడిపి మండల ప్రదాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ సొంత నిధులతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి ట్యాంకర్లతో తాగు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం రాజగోపాల్‌యాదవ్‌పై దాడి దుర్మార్గం

**కదిరి టౌన్ :** సామాజికవేత్త గడ్డం రాజగోపాల్‌యాదవ్‌పై దాడి దౌర్భాగ్యమని, పూర్తిస్థాయిలో విచారించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కదిరి యాదవ సంఘం ప్రెసిడెంట్ శ్రీరాములుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజగోపాల్ చేస్తున్న సేవా కార్యక్రమాలను జీర్ణించుకోలేని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇలాంటి అరాచకాలను ప్రోత్సహిస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. రాజగోపాల్ యాదవ్‌పై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసును ఉపసంహరించుకోవాలని లేనిచో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## పాలపాటిదిన్నెలో వైద్యశిబిరం

**నల్లచెరువు :** మండల పరిధిలోని పాలపాటిదిన్నెలో శనివారం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మైనుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో ఎంపిపి రమణారెడ్డి, సర్పంచి పంచరత్నమ్మ, వైస్ ఎంపిపి నారాయణస్వామి, పిహెచ్‌సి సిహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పి గాయత్రి, ఎఎన్ఎం రాధా, భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మున్నాబాయి, ఆశా కార్యకర్తలు రాధమ్మ, కవిత, ఆఫీస్ సబార్డినేట్ ప్రకాష్ పాల్గొన్నారు.

# ఎన్నికలపైనే దృష్టి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని47 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. సగానికిగా సాగుభూమి బీడుగానే ఉంది. నీళ్లు లేక ఇప్పటికే రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భూగర్భజలాలు క్రమక్రమంగా దిగువకు చేరుకుంటున్నాయి. గడిచిన మూడేళ్లలో వర్షాలు కొంత మెరుగ్గా రావడంతో ఊపిరి పిల్చుకున్న రైతులకు ఈఏడాది మళ్లీ కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. అయినా పాలకులకు కరువుపై ఏమాత్రం దృష్టి లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ త్వరలో ముగియనుంది. ఇప్పటికీ జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాల భూమిబీడుగా ఉంది. ఇంత పెద్దఎత్తున బీడుగా ఉన్న సమయంలో ప్రత్యామ్నాయ విత్తనాలిచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతవారంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల సమీక్ష నిర్వహించారు. అదే సమయంలో సత్యసాయి జిల్లాలోని నియోజకవర్గాల సమీక్షను అక్కడి ఇన్‌ఛార్జి మంత్రి జయరాం చేపట్టారు. ఈరెండు చోట్ల కూడా ప్రధానమైన జిల్లా సమస్యలపై కంటే నియోజకవర్గాల్లో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, ఇచ్చిన హామీలు వాటి అమలుపైనే ప్రధాన సమీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై కనీస ప్రస్తావన ఈ సమీక్షల్లో కనిపించలేదు. పంటలు ఎండిపోతున్న సమయంలో రైతాంగానికి ఆదుకునే చర్యలు చేపడుతున్నట్టు భరోసా కల్పించే విధంగా ఈ సమీక్షలు జరగలేదన్న విమర్శ సర్వత్రా వ్యక్తమవుతోంది. నియోజకవర్గాల్లో జరుగుతున్న పనులు, వాటికున్న ఆటంకాలపైనే చర్చించారు. అది కూడా గోప్యంగానే ఈ సమీక్షలు జరిగాయి. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఇవి జరిగాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా సమీక్షలు అంటే జిల్లా స్థాయిలో జరిగేవి. ఇందులో అధికారులతోపాటు, ప్రజాప్రతినిదులందరూ హాజరై జిల్లాలోని పరిస్థితులపై సమీక్ష జరిపేవారు. అందులో వచ్చే ప్రధానమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే చర్యలు చేపట్టేవారు. కాని గత కొంతకాలంగా జిల్లా సమీక్షా సమావేశం సైతం జరగలేదు. నియోజకవర్గ స్థాయిలోనే ఇవి జరుగుతున్నాయి. ఇందులో పాల్గొంటున్నది అధికారపార్టీ నాయకులే కాబట్టి సమస్యలేవి ప్రస్తావ లేకుండానే వారికి ప్రయోజనాలకు అనుగుణంగా సాగాయన్న విమర్శ వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో రైతాంగ ఆత్మహత్యలు సైతం పెరిగాయి. వీటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న యోచన కూడా ప్రభుత్వం వైపు నుంచి కనిపించడం లేదు. ఇక ఈవారంలో ముందుకొచ్చిన మరో ప్రధాన సమస్య కార్మికులది. కార్మికులు పెద్దఎత్తున ఉద్యమబాటనే పట్టారు. ప్రధానంగా సత్యసాయి వాటర్ వర్కర్సు , శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్సు వేతన బకాయిల కోసం పోరాటం చేపడుతున్నారు. కార్యాలయం ఎదుటే రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈనెల 20 తేదీ నుంచి సమ్మెలోకి సైతం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రతిసారి వేతన బకాయిల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ సమస్యను పట్టించుకునే నేతలెవరూ కనిపించడం లేదు. కేవలం ఈ బోర్డు పరిధిలో పనులను విభజించి కాంట్రాక్టులు తమకు దక్కించుకోవడంపైనే అందరి దృష్టి ఉంది తప్ప ఈ ప్రాజెక్టులో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నేతలెవరూ లేరన్న ఆరోపణలూ ఉన్నాయి.

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**గుడిబండ :** ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండల పరిధిలోని ఆచార్యపాలెం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఆచార్యపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా భూతప్ప కనుమలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న భూతప్పగుడిని ఢీకొన్నారు. దీంతో కరియన్న అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మూర్ఛవ్యాధితో పెయింటర్ మృతి

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని శారదనగర్‌లో శనివారం ఓ పెయింటర్ మూర్ఛవ్యాధితో మృతిచెందినట్టు టూటౌన్ పోలీసులు తెలిపా రు. స్థానిక శారదనగర్‌లోని ఓ ఇంటిలో ఒంటరిగా ఉంటున్న సుబ్బరాయుడు పెయింటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం సాయంత్రం ఇంటి ముందు అరుగుపై కుర్చుని ఉండగా ఉన్నఫలంగా మూర్ఛ(ఫిట్స్) రావడంతో కిందకుపడ్డాడు. దీంతో స్థానికులు 100కు డయల్ చేయడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ధర్మవరం ఆసుపత్రి లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## టిడిపి కార్యకర్త దుర్మరణం

**మడకశిర రూరల్ :** మండల పరిధిలోని బూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త కరియన్న(28) మృతి చెందాడు. వివరాలు.. గుణే మోరుబాగల్ పంచాయతీ 10వ వార్డు ఉప ఎన్నికలో టిడిపి మద్దతుదారు నరసింహప్ప గెలుపొందడంతో పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల్లో పాల్గొనడానికి గుడిబండ మండలానికి చెందిన టిడిపి కార్యకర్తలు కరియన్న, లోకేష్ ద్వి చక్రవాహంపై వస్తుండగా మార్గమధ్యలో బూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో రోడ్డు మలుపులో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న బస్ షెల్టర్ ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో కరియన్న అక్కడికక్కడే మృతి చెందగా లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మార్గంలో వెళ్తున్న పలువురు టిడిపి శ్రేణులు క్షతగాత్రుడిని 108 ద్వారా మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. ఈ ఘటనపై గుడిబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## వైసిపి సీనియర్ నాయకుడు మృతి

**కొత్తచెరువు రూరల్ :** మండల పరిధిలోని యర్రపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ రెడ్డి(74) శనివారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి ఆ గ్రామం వెళ్లి సత్యనారాయణరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఆయన వెంట సర్పంచులు గీతరూప్లానాయక్, సింగిల్‌విండో అధ్యక్షులు తిప్పారెడ్డి, నందిరెడ్డి, రామచంద్ర, శివారెడ్డి, కోఆప్షన్ సభ్యులు మున్వర్ బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, వైస్ సర్పంచి ఆంజనేయులు, అనిల్, హేమాద్రి, నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్, తదితరులు ఉన్నారు.

## వైసిపి నాయకునికి మాతృవియోగం

**గోరంట్ల రూరల్ :** మండల పరిధిలోని గంగంపల్లి పంచాయతీ దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నాగభూషణరెడ్డి తల్లి పార్వతమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర నారాయణ సోదరుడు మాలగుండ్ల మల్లికార్జున ఆ గ్రామం వెళ్లి పార్వతమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ మెంబెర్ పాటూరి లక్ష్మీరెడ్డి సింగిల్‌విండో అధ్యక్షులు శంకరరెడ్డి, జనార్ధనరెడ్డి, సర్పంచి వెంకటకృష్ణారెడ్డి, ఎంపిటిసి వెంకటరంగారెడ్డి, కేశవరెడ్డి, సర్పంచి వాసునాయక్ పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

**ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్**

రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు పొందేందుకు శనివారం నుంచి మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ చేపట్టినట్లు ఎఒ నటరాజ్ తెలిపారు. మండల వ్యాప్తంగా తీవ్ర వర్షాభావం నెలకొనడంతో వేరుశనగ, కంది, మొక్కజొన్న, పంటలు వేయడానికి అదును దాటిపోయినందున, చాలామంది రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, అలసంద, పెసర, జొన్న పంటల సాగుపై మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, తీసుకుని బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 10 రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ ఉంటుందని విత్తనాలు పొందిన రైతులు తప్పనిసరిగా పంట వేసుకోవాలని సూచించారు.

## ఓటరు జాబితా సరిదిద్దాలని వినతి

**ముదిగుబ్బ :** మండలంలో ఓటర్ల జాబితాలోని తప్పులను గుర్తించి సరిదిద్దాలని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వివాహ మై అత్తారింటికి వెళ్లిపోయిన యువతులు, మృతి చెందిన, శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లిన, కొన్ని కారణాల వల్ల తప్పుగా నమో దైన ఓటర్లను గుర్తించి సరిదిద్దాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో తుమ్మల సూరి, జానీ, దొరిగిల్లు సూరి, సూర్యశేఖర్ రాజు, నారాయణస్వామి, గడ్డం మోహన్, కృష్ణమూర్తియాదవ్, మోహన్‌నాయుడు, రఫీ, రియాజ్, అశోక్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి భవిష్యత్తు

**ముదిగుబ్బ :** కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ షాన్‌వాజ్ పేర్కొన్నారు. ముదిగుబ్బలో శనివారం పిసిసి డెలిగేట్ నిస్సార్ అహ్మద్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప ఆ తర్వాత ఏ పార్టీ అధికారంలోని వచ్చినా చేసింది శూన్యమ న్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కదిరి నియోజక వర్గ కన్వీనర్ అశ్వర్థనారాయణ, బాసినేని ప్రభాకర్, నాగరాజు, ఆదినారాయణ, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రం తనిఖీ

**తలుపుల :** మండల పరిధిలోని ఓబుళరెడ్డిపల్లి 1వ అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపిడిఒ కిరణ్‌మోహన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించడంతో పాటు స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే అందజేస్తున్న పౌష్టికా హారం గురించి అంగన్వాడీ కార్యకర్త రజియాను అడిగి తెలుసుకున్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై తహశీల్దార్‌కు ఫిర్యాదు

**ముదిగుబ్బ :** ముదిగుబ్బ పాతూర్లో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్నికల సిబ్బందితో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ మోపూరి సురేష్‌కుమార్ తరచూ పాల్గొంటున్నాడని మండల అఖిలపక్షం నాయకులు శనివారం తహశీల్దార్ నాగేంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అందుకు సంబంధించిన ఫొటోలను తహశీల్దార్‌కు చూపించారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి పట్టణ కార్యదర్శి తుమ్మల మనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, బిజెపి నేత సోమల ప్రకాష్‌నాయుడు, టిడిపి నాయకులు తుమ్మల సూరి, డిష్ రామాంజి, పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తచెరువు :** స్థానిక శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని, దీంతో గెస్ట్ లెక్చరర్‌గా నియామకం చేసుకొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఇంటర్వ్యూ పద్ధతిన ఎంపిక చేస్తామన్నారు.

## ఆలయ పునర్‌నిర్మాణానికి శంకుస్థాపన

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి శంకుస్థాపన, పూజా కార్యక్రమాలను శనివారం ఆలయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు జయశ్రీ, ఆమె భర్త డాక్టర్ నరసింహు లు, కమిటీ సభ్యులు తెల్లవారుజామున శంకుస్థాపన, పూజలు నిర్వహించారు.